జమ్మికుంట మున్సిపల్ చైర్మన్‌కు శస్త్ర చికిత్స

- పరామర్శించిన వినోద్‌కుమార్

రాజేశ్వర్‌రావును పరామర్శిస్తున్న వినోద్‌కుమార్

జమ్మికుంట, జనవరి7: షాద్‌నగర్ నియోజకవర్గం లోని కొత్తూర్‌లో ఇటీవల కాంగ్రెస్ వర్గాలు చేసిన దాడిలో గాయపడిన జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ రాజేశ్వర్‌రావుకు శనివారం సికింద్రాబాద్ లోని యశోద దవాఖానలో డాక్టర్ ప్రవీణ్‌రావు ఆధ్వర్యంలో ఎడమ చేతి వేలికి శస్త్ర చికిత్స జరుగగా, ఆదివారం ప్రణాళికా సంఘం మాజీ ఉపాధ్యక్షుడు బీ వినోద్‌కుమార్ పరామర్శించారు. దాడి దురదృష్టకరమని, బాధితులకు పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చారు. రెస్టు తీసుకోవాలని సూచించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. తర్వాత వైద్య బృందంతో మాట్లాడారు. మెరుగైన సేవలందించాలని కోరారు. ఇక్కడ పలువురు నాయకులు, తదితరులున్నారు. కాగా, చైర్మన్ రాజేశ్వర్‌రావును దవాఖాన వైద్యులు డిశ్చార్జి చేయగా, సాయంత్రం జమ్మికుంటకు చేరుకున్నారు.

బట్టల దుకాణంలో అగ్ని ప్రమాదం

మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

రాంనగర్, డిసెంబర్ 7: నగరంలోని రాజీవ్‌చౌక్‌లో గల మణిదీప్ ఫ్యాబ్రిక్ హౌస్ (రెడీమేడ్ బట్టల దుకాణం)లో ఆదివారం తెల్లవారుజామున అకస్మాత్తుగా మంటలు చెలరేగాయి. స్థానికులు పొగలు రావడం గమనించి ఫైర్ సిబ్బందికి సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలు అదుపు చేసేందుకు ప్రయత్నించారు. అప్పటికే దుకాణం అంతా మంటలు వ్యాపించడంతో మానకొండూర్ ఫైర్ సిబ్బందిని కూడా రంగంలోకి దింపి రెండు గంటల పాటు శ్రమించి మంటలను పూర్తిగా అదుపు చేయగలిగారు. ఫైర్ సిబ్బంది స్థానిక వ్యాపారులను విచారించగా దుకాణా యజమాని విద్యానగర్‌కు చెందిన తిప్పిరెడ్డి సరితా రెడ్డిగా గుర్తించి సమాచారం అందించారు. అగ్ని ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు జరుపుతున్నట్లు అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. ఈ ఘటనలో ప్రాణ నష్టం సంభవించలేదని, ఆస్తి నష్టం వివరాలను దర్యాప్తు అనంతరం వెల్లడిస్తామని చెప్పారు.

కార్యకర్తలు అధైర్యపడొద్దు

మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్, పక్కన మాజీ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్, ఇతర ప్రజాప్రతినిధులు

- భవిష్యత్ అంతా బీఆర్ఎస్‌దే
- తెలంగాణను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసిన ఘనత కేసీఆర్ సర్కారుదే
- కాంగ్రెస్ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొడదాం
- మాజీ ఎంపీ బీ వినోద్‌కుమార్
- పోతారంలో హుస్నాబాద్ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశం

చిగురుమామిడి, జనవరి 7: అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిపాలయ్యామని కార్యకర్తలు అధైర్యపడొద్దని మాజీ ఎంపీ బీ వినోద్‌కుమార్ భరోసానిచ్చారు. ప్రజల్లో బీఆర్ఎస్‌కు ప్రత్యేక గుర్తింపు ఉన్నదని, భవిష్యత్ అంతా మనదేనని అని చెప్పారు. ప్రస్తుత పరిస్థితులపై ప్రజలను చైతన్యవంతం చేసి వచ్చే పార్లమెంట్, స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు కార్యకర్తలు, నాయకులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. హుస్నాబాద్ మండలం పోతారం(ఎస్)లోని 'శుభం' గార్డెన్‌లో ఆదివారం జరిగిన నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కొట్లాడి తెచ్చుకున్న తెలంగాణను పదేళ్లలో దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దిన ఘనత బీఆర్ఎస్‌దేనని కొనియాడారు. రాష్ర్టాన్ని బంగారు పల్లెంలో పెట్టి కాంగ్రెస్‌కు అప్పగిస్తే, వారు అసత్యపు ప్రచారం చేస్తూ బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని బద్నాం చేసే కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికలకు ముందు రైతు బంధు కోసం ₹7వేల కోట్ల నిధులను సిద్ధంగా ఉంచి రైతుల ఖాతాల్లో వేయడానికి ప్రభుత్వం చర్యలు చేపడితే కాంగ్రెస్ అడ్డుకున్నదన్నారు. పదేళ్లలో 1.61లక్షల ఉద్యోగాలను భర్తీ చేసి మరో 43వేల పోస్టులకు నోటిఫికేషన్ ఇచ్చామన్నారు. 2 లక్షల ఉద్యోగాలు ఏడాదిలోగా ఇస్తామని కాంగ్రెస్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్ర ప్రజలకు ఎన్నో ఆశలు కల్పించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, ఇచ్చిన ప్రతి వాగ్దానాన్ని నెరవేర్చి చూపాలని సవాల్ చేశారు. కార్యక్రమంలో హనుమకొండ జడ్పీ చైర్మన్ డాక్టర్ సుధీర్‌కుమార్, బీఆర్ఎస్ కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు, నాయకులు గోపాల్‌రావు, పన్యాల భూపతిరెడ్డి, కర్ర శ్రీహరి, దేవేందర్‌రావు, ఎంపీపీ కొత్త వినీత, వైస్ ఎంపీపీ బేతి రాజిరెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మామిడి అంజయ్య, సింగిల్ విండో చైర్మన్ జంగ వెంకటరమణారెడ్డి, జిల్లా నాయకులు కొత్త శ్రీనివాస్‌రెడ్డి, సాంబారి కొమురయ్య, రామోజు కృష్ణమాచారి, మండల నాయకులు మంకు శ్రీనివాస్‌రెడ్డి, పెనుకుల తిరుపతి, రాంబాబు, ఎస్‌కే సిరాజ్, తిరుపతిరెడ్డి, వెంకటేశం, రాజేశం, సదానందం, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

ఎన్నికల్లో గెలిచినా, ఓడినా కార్యకర్తలకు అన్ని విధాలా అండగా ఉంటాం. ఈ ప్రాంత బీఆర్ఎస్ కార్యకర్తలు ఎంతో చైతన్యవంతులు. కొన్ని ప్రతికూల పరిస్థితులతో అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమిని చవి చూశాం. వచ్చే ఎన్నికల్లో మన సత్తా చాటాల్సిన అవసరం ఉన్నది. వచ్చే ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి బీ వినోద్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుందాం. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే ప్రజల తరపున ఉద్యమించాల్సిన బాధ్యత మనపై ఉన్నది.

- వొడితెల సతీశ్‌కుమార్, మాజీ ఎమ్మెల్యే

సమావేశానికి హాజరైన నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు

ఎల్లమ్మ ఆలయంలో ఎమ్మెల్యే పూజలు

ఎమ్మెల్యే గంగుల కమలాకర్‌ను శాలువాతో సత్కరించి, అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న జీకే యూత్ అధ్యక్షుడు ప్రశాంత్ గౌడ్, బీఆర్ఎస్ నాయకుడు సల్ల రవీందర్, తదితరులు

కమాన్‌చౌరస్తా, జనవరి 7: నగరంలోని 8వ డివిజన్ (అల్గునూర్)లో గల ఎల్లమ్మ ఆలయంలో మాజీ మంత్రి, ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గంగుల కమలాకర్ నాలుగోసారి ఎమ్మెల్యేగా గెలువాలని జీకే యూత్ 8వ డివిజన్ అధ్యక్షుడు పల్లె ప్రశాంత్ గౌడ్ ఆలయంలో మొక్కుకున్నారు. కాగా, ప్రశాంత్‌గౌడ్ ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే గంగుల కమలాకర్ ఆలయంలో మొక్కు చెల్లించారు. పూజల్లో కార్పొరేటర్ సల్ల శారద-రవీందర్, జీకే యూత్ అధ్యక్షుడు వెంకట్, సభ్యులు రాజు, శ్రీకాంత్, సురేశ్, అజయ్, వరుణ్, క్రిపల్, శ్రావణ్, అభినయ్ పాల్గొన్నారు.

వినోద్‌కుమార్‌పై తప్పుడు ప్రచారాన్ని సహించేది లేదు

- బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి బండ శ్రీనివాస్

మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాస్

హుజూరాబాద్‌టౌన్, జనవరి7: కరీంనగర్ మాజీ పార్లమెంట్ సభ్యుడు బోయినపల్లి వినోద్‌కుమార్‌పై బీజేపీ సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తే సహించేది లేదని బీఆర్ఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ హెచ్చరించారు. ఆదివారం పట్టణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. జెన్‌కో లో అర్హత లేకున్నా సీఎండీ ప్రభాకర్‌రావు ఓ యువతికి ఏఈ ఉద్యోగం ఇచ్చారని, ఆమె బోయినపల్లి వినోద్‌కుమార్ బంధువు అంటూ తీన్మార్ మల్లన్న తన మీడియాలో తప్పుడు ప్రచారం చేయడం ఎవరి మెప్పు కోసమో ప్రజలకు తెలుసన్నారు. వాస్తవాలు తెలుసుకోకుండా, తప్పుడు కథనాలు అల్లడం దుర్మార్గమైన చర్య అని మండిపడ్డారు. మంచి నాయకుడిగా పేరు తెచ్చుకున్న వినోద్‌కుమార్‌కు అవినీతి ఆరోపణలు అంటగట్టి బద్నాం చేయాలని చూస్తే సహించేది లేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ, కాంగ్రెస్ కుట్రలు, కుతంత్రాలు చేస్తున్నాయని, ఎవరు ఎన్ని కుట్రలు చేసినా వినోద్‌కుమార్ గెలుపును ఎవరూ ఆపలేరని స్పష్టం చేశారు.

నాణ్యతా ప్రమాణాలతో జీపీ భవనాల నిర్మాణం

చిగురుమామిడి, జనవరి 7: మండలంలోని ఐదు గ్రామాల్లో నూతనంగా చేపట్టిన గ్రామ పంచాయతీ కార్యాలయ భవన నిర్మాణ పనులు నాణ్యతా ప్రమాణాలతో జరుగుతున్నాయని పంచాయతీ రాజ్ డీఈ రవిప్రసాద్ పేర్కొన్నారు. మండలంలోని నవాబ్ పేట్ గ్రామంలో కొనసాగుతున్న జీపీ భవన నిర్మాణ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. నవాబ్ పేట్, ముదిమాణిక్యం మినహా గాగిరెడ్డిపల్లి, సీతారాంపూర్, గునుకుల పల్లె గ్రామాల్లో పంచాయతీ భవన నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని పేర్కొన్నారు. ఆయన వెంట సర్పంచ్ సుద్దాల ప్రవీణ్, ఉపసర్పంచ్ ఎలగందుల రాజయ్య తదితరులు ఉన్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం

కమాన్‌చౌరస్తా/విద్యానగర్, జనవరి 7: జిల్లా కేంద్రంలోని భగత్‌నగర్ అయ్యప్ప ఆలయంలో తెలంగాణ హాస్పిటల్స్ అండ్ నర్సింగ్ హోమ్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్, ఈసీ సభ్యులు మినరల్ వాటర్ ప్లాంట్ ఏర్పాటు చేశారు. ప్లాంట్‌ను తానా ప్రెసిడెంట్ డాక్టర్ వీ రాకేశ్, డాక్టర్ ఎలగందుల శ్రీనివాస్ ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ మహేశ్, డాక్టర్ వెంకటేశ్వరరావు, డాక్టర్ శ్రీధర్, అయ్యప్ప ఆలయ ఈవో కాంతారెడ్డి, అర్చకులు రాజేశ్వర శర్మ, చాణక్య శర్మ, శ్రీనివాస శర్మ, మూర్తి శర్మ, కోల అన్నా రెడ్డి, తానా సభ్యులు పాల్గొన్నారు.

మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న తానా సభ్యులు

ఆరోగ్యంపై జాగ్రత్తగా ఉండాలి

విద్యానగర్, జనవరి 7: ప్రతి ఒక్కరూ ఆరోగ్యం విషయంలో జాగ్రత్తగా ఉండాలని పల్మనాలజిస్ట్ డాక్టర్ వినయ్ సూచించారు. జిల్లా కేంద్రంలోని ఎస్సారార్ డిగ్రీ, పీజీ కళాశాల మైదానంలో ఆదివారం కరీంనగర్ మెడికవర్ దవాఖాన, ఐఎంఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హెల్త్ టాక్‌లో ఆయన మాట్లాడారు. చలికాలంలో శ్వాసకోశ సమస్యలు ఎక్కువగా వస్తుంటాయని, వాటిని ఎదుర్కొనేందుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అస్తమా బాధితులు చలి, దుమ్ము, ధూళి ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో తిరిగితే జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మెడికవర్ దవాఖాన సెంటర్ హెడ్ గుర్రం కిరణ్, ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రామకృష్ణ, దవాఖాన మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రవి మల్లారెడ్డి, నర్సింగ్ సూపరింటెండెంట్ రోహిణి, మార్కెటింగ్ హెడ్ కరుణాకర్, హెచ్‌ఆర్ మేనేజర్ ఈశ్వర్, ఆపరేషన్స్ మేనేజర్ సాయి చరణ్, సిబ్బంది పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★త్రివేణి హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9640400073/9160900024.
NT-319407-All

బిల్డింగ్ అమ్మబడును

★కరీంనగర్‌లోని కొత్త యాస్వాడ హరిహర రోడ్ నెంబర్.2 గ్రౌండ్ ఫ్లోర్ ఓపెన్ ఫస్ట్ ఫ్లోర్ 2BHK ఉత్తరం ఫేసింగ్. 30 ఫీట్ రోడ్డు. గల బిల్డింగ్ అమ్మబడును. సంప్ర|| సెల్: 9848034203.
NTK-317328

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 91827 77571
91827 77194

ఖాదీ వస్త్రాల కొనుగోళ్లపై ప్రత్యేక తగ్గింపు

హౌసింగ్‌బోర్డుకాలనీ, జనవరి 7: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని కరీంనగర్‌లోని కమాన్ నుంచి రూరల్ పోలీస్ స్టేషన్ రోడ్డులో గల మెట్‌పల్లి ఖాదీ భవన్‌లో ఈ నెల 31వ తేదీ వరకు ఖాదీ వస్త్రాల కొనుగోళ్లపై 40% ప్రత్యేక తగ్గింపు ఇస్తున్నట్లు సంస్థ చైర్మన్ కే విద్యాసాగర్ రావు, ఖాదీ భవన్ మేనేజర్ భిక్షపతి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి ఒక్కరూ ఖాదీ వస్త్రాలు ధరించి, నేత కార్మికులకు ఉపాధి కల్పించాలని కోరారు.

నేడు నగరంలో విద్యుత్ ఉండని ప్రాంతాలు

ముకరంపుర, జనవరి 7: నగరంలో విద్యుత్ తీగల కింద ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు, ఇంప్రూవ్‌మెంట్ పనులు చేపడుతున్నందున సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు 11కేవీ మంకమ్మతోట ఫీడర్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్-2 ఏడీఈ సుధీర్‌కుమార్ తెలిపారు. మంకమ్మతోట, పొన్నం కాంప్లెక్స్, కశ్మీర్ గడ్డలో కొంత ప్రాంతం, గోపాల్ రావు బిల్డింగ్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఖోఖో జట్ల ఎంపిక పోటీలకు స్పందన

కొత్తపల్లి, జనవరి 7: జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ స్టేడియంలో జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉమ్మడి జిల్లా సీనియర్స్ ఖోఖో జట్ల ఎంపిక పోటీలకు విశేష స్పందన వచ్చింది. క్రీడాకారులను జిల్లా యువజన, క్రీడాశాఖాధికారి కీర్తి రాజవీరు, సీనియర్ క్రీడాకారిణులు మంగ-సంతోష్, రేణుక పరిచయం చేసుకొని పోటీలను ప్రారంభించారు. పోటీలను ఖోఖో అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నటరాజ్ రవి, వై మహేందర్‌రావు పర్యవేక్షించారు. పీఈటీలు, జిల్లా ఖోఖో సంఘం సభ్యులు రవీందర్, ప్రసాద్, యోగి, సంతోష్, కరుణాకర్, శేఖర్, శివకుమార్, రాజబాబు, రవళి, రేణుక పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

ఇల్లందకుంట, జనవరి 7: మండల కేంద్రంలో ఇండో అమెరికా ఫిజిషియన్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి గ్రామస్తుల నుంచి మంచి స్పందన లభించింది. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న వారికి పరీక్షలు నిర్వహించారు. 500 మందికి మందులు అందజేశారు. సర్పంచ్ శ్రీలతాసురేందర్‌రెడ్డి, వైద్యులు దామోదర్, శ్రీదేవి, కల్యాణ్, హెల్త్ ఎడ్యుకేటర్ మోహన్‌రెడ్డి, వైద్య సిబ్బంది ఉన్నారు.

ఆలయ భూములు కాపాడాలని మంత్రికి వినతి

తిమ్మాపూర్ రూరల్, జనవరి 7: మండలంలోని రామకృష్ణ కాలనీలో గల అనంత పద్మనాభ స్వామి ఆలయానికి సంబంధించిన భూములను కాపాడాలని కాంగ్రెస్ నాయకులు ఆదివారం మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి విన్నవించారు. వెంటనే సర్వే చేయించి, భూములు కబ్జా కాకుండా చూడాలని కోరారు. అనంతరం మంత్రిని సత్కరించారు. ఇక్కడ మాచర్ల అంజయ్య గౌడ్, శ్రీనివాస్ గౌడ్ తదితరులు ఉన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు వేగవంతం చేయించాలని..

చిగురుమామిడి, జనవరి 7: ముదిమాణిక్యం గ్రామం నుంచి ఇందుర్తి, కోహెడ వెళ్లే ప్రధాన రహదారి వరకు చేపట్టిన రోడ్డు నిర్మాణ పనులను వేగవంతం చేయించాలని సర్పంచ్ జక్కుల రవి మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. పనుల్లో జాప్యంతో వాహనదారులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను మంత్రికి వివరించారు.

మహోన్నత వ్యక్తి వివేకానందుడు

హౌసింగ్‌బోర్డుకాలనీ, జనవరి 7: మహోన్నత వ్యక్తి స్వామి వివేకానంద అని హమ్ సంస్థ వ్యవస్థాపకుడు ధనపురి సాగర్ తెలిపారు. స్థానిక సరస్వతీ నగర్‌లోని కపిల్ బాలకుటీర్ విద్యార్థులకు వివేకానంద జయంతిని పురస్కరించుకొని హమ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. కాగా, ఆయన విజేతలకు బహుమతులు అందజేసి, మాట్లాడారు. కార్యక్రమంలో బాలకుటీర్ మేనేజర్ గీకూరి శ్రీనివాస్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

అక్షింతలు, హనుమాన్ చాలీసా పుస్తకాల పంపిణీ

కమాన్‌చౌరస్తా, జనవరి 7: నగరంలోని శివాలయం వీధిలో ఆంజనేయ సేవా సమితి, భజన మండలి ఆధ్వర్యంలో ఆదివారం రాములోరి అక్షింతలు, హనుమాన్ చాలీసా పుస్తకాలు, రాముడి చిత్రపటాలను పంపిణీ చేశారు. సభ్యులు తిరుపతి స్వామి, రమేశ్, శ్రీనివాస్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

జిల్లా ఓటర్లు @10,64,129

- ముసాయిదా జాబితా విడుదల
- పెరిగిన 4,914 మంది ఓటర్లు
- ఈనెల 22వ తేదీ వరకు అభ్యంతరాలు, ఫిర్యాదుల స్వీకరణకు అవకాశం
- ఫిబ్రవరి 8న తుదిజాబితా

కలెక్టరేట్, జనవరి 7: పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి జిల్లా ఓటర్ల ముసాయిదా జాబితాను రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. దీని ప్రకారం జిల్లాలో 10,64,129 మంది ఓటర్లు ఉన్నట్లు వెల్లడించింది. గత నవంబర్ 11 వరకు 10,59,215 మంది ఓటర్లు ఉండగా, అసెంబ్లీ ఎన్నికల అనంతరం ఎన్నికల సంఘం మరోసారి 18 ఏళ్లు నిండిన వారిని ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఈనెల 5వ తేదీ వరకు అవకాశం కల్పించింది. వచ్చిన దరఖాస్తుల ప్రకారం 6న ముసాయిదా జాబితా ప్రకటించింది. గత జాబితాతో పోల్చితే ఈసారి జిల్లాలో 4,914 మంది కొత్తగా ఓటు హక్కు నమోదు చేసుకున్నారు. వీరిలో మహిళా ఓటర్లే అధికంగా ఉండగా, కరీంనగర్ మినహా చొప్పదండి, మానకొండూర్, హుజూరాబాద్ సెగ్మెంట్లలో వారి సంఖ్య పెరిగింది. ఫిబ్రవరి 8న వెలువరించనున్న తుది ఓటరు జాబితా ప్రకారమే పార్లమెంటు ఎన్నికలు నిర్వహించనుండగా, కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారిలో 18 ఏళ్లు నిండిన వారే ఎక్కువగా ఉన్నట్లు గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. కాగా, ఓటు నమోదు ప్రక్రియలో అర్హులంతా భాగస్వాములవ్వాలని ఎన్నికల సంఘం కోరుతున్నా, పెరుగుతున్న ఓటరు జాబితాను అనుసరించి ఓటరుగా నమోదు కాని వారు ఇంకా అనేక మంది ఉన్నట్లు పెరుగుతున్న ఓటర్ల సంఖ్యతో తేటతెల్లమవుతున్నది.

టీజీలు, ఎన్నారైల స్పందన నామమాత్రమే

గతంలో ఎన్నడూ లేనివిధంగా ఎన్నికల కమిషన్ క్రితంసారి నుంచి ట్రాన్స్‌జెండర్లకు ఓటు హక్కు అవకాశం కల్పించింది. దీనిని సద్వినియోగం చేసుకునేందుకు ఓటరుగా నమోదు కావాలంటూ ఈసీ పిలుపునిచ్చినా స్పందన నామమాత్రంగానే ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలో వందలాది మంది ట్రాన్స్‌జెండర్లు ఉండగా కేవలం 56 మంది ఓటరుగా నమోదు చేసుకున్నారు. వీరిలో అత్యధికంగా కరీంనగర్ సెగ్మెంట్ నుంచే ఉన్నారు. అలాగే, నాన్ రెసిడెంట్ ఆఫ్ ఇండియా (ఎన్ఆర్ఐ)లు కూడా వేల సంఖ్యలో విదేశాల్లో ఉన్నారు. వారికి కూడా ఓటు హక్కు నమోదు చేసుకునే అవకాశాన్ని ఎన్నికల సంఘం కల్పించింది. వీరంతా ఫాం 6ఏ ద్వారా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని ఈసీ పెద్ద ఎత్తున ప్రచారం చేసింది. గతంలో జిల్లా మొత్తం 116 మంది మాత్రమే ఓటర్లుండగా, వీరికి అదనంగా మరో 9 మంది ఈసారి నమోదు చేసుకున్నారు. తాజాగా విడుదలైన ముసాయిదా జాబితా ప్రకారం కరీంనగర్ అసెంబ్లీ సెగ్మెంట్‌లో 3,57,861 మంది, చొప్పదండిలో 2,33,551 మంది, మానకొండూర్‌లో 2,22,496 మంది, హుజూరాబాద్‌లో 2,50,221 మంది ఓటర్లు ఉన్నట్లు తేల్చింది. ఈ జాబితాను గ్రామపంచాయతీల్లో ప్రదర్శించనున్నట్లు ఎన్నికల అధికారులు పేర్కొంటున్నారు. జాబితాలో ఉన్న ఓటర్లపై అభ్యంతరాలు, ఫిర్యాదులు ఉంటే ఈనెల 22 వరకు స్వీకరించనున్నట్లు ఎన్నికల అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఫిబ్రవరి 2 వరకు వాటిని పరిష్కరించి, అదే నెల 8న ఎన్నికల సంఘం తుదిజాబితా విడుదల చేయనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారులు వెల్లడిస్తున్నారు.

వేదికపై ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

చిగురుమామిడి, జనవరి 7: ఇందుర్తి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 1994-95 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. 29 సంవత్సరాల తర్వాత తిరిగి ఒక్క చోట చేరిన స్నేహితులంతా నాటి జ్ఞాపకాలను నెమరేసుకున్నారు. తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధి కోసం సహకారం అందించాలని నిర్ణయించుకున్నారు. తమకు విద్యాబుద్ధులు బోధించిన ఉపాధ్యాయులను సత్కరించారు. ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

'పారమిత'లో అట్టహాసంగా సత్యోత్సవం



విద్యార్థినికి స్కాలర్‌షిప్ చెక్కు అందజేస్తున్న పారమిత విద్యా సంస్థల చైర్మన్ ప్రసాద్‌రావు

కమాన్‌చౌరస్తా, జనవరి 7: జిల్లా కేంద్రంలోని పద్మనగర్‌లో గల పారమిత హెరిటేజ్ పాఠశాలలో 'సత్యోత్సవం' పేరిట ఆదివారం వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. వేడుకలను విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఈ ప్రసాద్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు విభాగాల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందజేశారు

ఆలయ వార్షికోత్సవం

చొప్పదండి, జనవరి 7: మండలకేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర మణికంఠాలయం 9వ వార్షికోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా ఆదివారం ఉదయం గణపతి హోమం, అయ్యప్ప మూల విరాట్‌కు ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. ప్రత్యేక పూజలు చేశారు. శనివారం రాత్రి ఆలయం నుంచి దేవతా విగ్రహాలతో చేపట్టిన శోభాయాత్రలో అయ్యప్పస్వాముల పేటతుల్లి, మహిళల కోలాటాలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఆలయ చైర్మన్ బొడిగె వెంకటేశ్‌గౌడ్, మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, వైస్ చైర్‌పర్సన్ ఇప్పనపల్లి విజయలక్ష్మి, మాజీ జడ్పీటీసీ సాంబయ్య, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చంద్రశేఖర్‌గౌడ్, మాజీ వైస్‌చైర్మన్ గంగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమావేశానికి తరలిన బీఆర్ఎస్ నాయకులు

సైదాపూర్, జనవరి 7: హుస్నాబాద్‌లో ఆదివారం బీఆర్ఎస్ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించగా, మండలం నుంచి నాయకులు తరలివెళ్లారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు సోమారపు రాజయ్య, జడ్పీ వైస్ చైర్మన్ పేరాల గోపాల రావు, ఎంపీపీ సారబుడ్ల ప్రభాకర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్లు కొత్త తిరుపతిరెడ్డి, బిల్ల వెంకట్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు తరలివెళ్లిన వారిలో ఉన్నారు.

గుండెపోటుతో కళాకారుడు మృతి

కమాన్‌చౌరస్తా, జనవరి 7: నగరంలోని జ్యోతినగర్‌కు చెందిన తెలంగాణ బెస్త గంగపుత్ర సంఘం జిల్లా అధ్యక్షుడు దేశ శివకుమార్ ఆదివారం ఉదయం గుండె పోటుతో మృతి చెందారు. జిల్లా కేంద్రంలోని కళాభారతిలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో శివకుమార్ ఉత్సాహంగా పాల్గొన్నారు. 1990లో 'గొల్ల మల్లమ్మ కోడలా' పాట ద్వారా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆయన అందరి మన్ననలు పొందారు. ఈ క్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉత్తమ జానపద గాయకుడిగా ఎన్నో ప్రశంసలు అందుకున్నారు. ఆయన మృతికి ఎమ్మెల్యే గంగుల కమలాకర్, మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, ఎంపీ బండి సంజయ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్, మేయర్ వై సునీల్ రావు, మాజీ మేయర్లు డీ శంకర్, రవీందర్ సింగ్, మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ తదితరులు సంతాపం తెలిపారు. అలాగే, ఆయన మృతి పట్ల జిల్లా కళాకారులు దిండిగాల రవీందర్, కుమార్, మహర్షి, కాసు మహేందర్ రాజు, సంఘం రాధాకృష్ణ, చిట్టి తిరుపతి, ఉపేందర్, ప్రసాద్, వైఎస్ శర్మ, కృపాదానం, వై అనిల్ కుమార్ గౌడ్, కాసు మధు, రాధాకృష్ణ, శంకర్, కొండల్‌రావు, రఘువీర్ సింగ్, ఎలిగేటి రాజేంద్ర ప్రసాద్, శ్రీరాములు గౌడ్ సంతాపం వ్యక్తం చేశారు.

దరఖాస్తుల ఆహ్వానం

కలెక్టరేట్, జనవరి 7: పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాల కోసం కళాశాలల విద్యార్థులు ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమాధికారి నతానియేల్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులు దరఖాస్తులను వెబ్‌సైట్ ఈపాస్ (http;// telanganaepass.cgg.gov.in) లో నమోదు చేసుకోవాలని పేర్కొన్నారు. విద్యార్థులు దరఖాస్తు చేసుకునేలా ఆయా కళాశాలల ప్రిన్సిపాళ్లు ప్రోత్సహించాలని సూచించారు.

పద్మశాలీ సంఘ రాష్ట్ర అధ్యక్షుడి మృతికి సంతాపం

తెలంగాణచౌక్, జనవరి 7: పద్మశాలీ రాష్ట్ర అధ్యక్షుడు మచ్చ ప్రభాకర్ మృతి పద్మశాలీలకు తీరని లోటని సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు వాసాల రమేశ్, అధ్యక్షుడు మెతుకు సత్యం, ప్రధాన కార్యదర్శి వల్లాల కృష్ణహరి పేర్కొన్నారు. నగరంలోని సంఘ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. సంఘం ప్రచార కార్యదర్శి భద్రయ్య, నాయకులు రవీందర్, ప్రభాకర్ ఉన్నారు.

వోపా ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు

కమాన్‌చౌరస్తా, జనవరి 7: జిల్లా కేంద్రంలోని బృందావన్ గార్డెన్‌లో వోపా ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. వోపా సభ్యులు ద్రోణాచారి, విష్ణువర్ధన్, సత్యనారాయణ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బస్సు ఢీకొని వృద్ధుడి మృతి

రాంనగర్, జనవరి 7: నగరంలోని మంచిర్యాల చౌరస్తాలో బస్సు ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. భగత్‌నగర్‌కు చెందిన బత్తిని రాజయ్య (76) ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. మంచిర్యాల చౌరస్తాలో బస్సు అతివేగంగా వచ్చి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. రాజయ్య కుమారుడు అనిల్‌కుమార్‌గౌడ్ ఫిర్యాదు మేరకు త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

అంబేద్కర్ సంఘం నూతన కమిటీ

తిమ్మాపూర్, జనవరి7: తిమ్మాపూర్ గ్రామ అంబేద్కర్ సంఘం నూతన కమిటీ ఆదివారం ఎన్నికైంది. అధ్యక్షుడిగా బొర్ర వంశీతో పాటు ఇతర కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు నాయకులు తెలిపారు. కార్యక్రమంలో మాతంగి లక్ష్మణ్, శంకర్, అశోక్, రమేశ్, దళిత సంఘ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.